క్లుప్తంగా

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకోబోమని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. స్థానిక లెనిన్‌నగర్‌లో శనివారం కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాత్రిపూట ఇతర రాష్ట్రాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పోలీసు సిబ్బంది, లెనిన్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో వీడ్కోలు హంగామా



గోదావరిఖనిటౌన్: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు రవి, ప్రసాద్, శ్యామ్, సుధ, రమ్య, శ్రీనివాస్, రవీందర్, అజయ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

కమాన్‌పూర్: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పీఏ చంద్రశేఖర్ గ్రామాల్లోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. మండల పరిధిలో 45మందికి కల్యాణలక్ష్మి, 32 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద శనివారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.

మేల్, ఫిమేల్ సీడ్ సాగుతో సిరులు


చెక్కు అందజేస్తున్న ఆర్గనైజర్

జూలపల్లి: వరి సీడ్ మేల్, ఫిమేల్ సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని టాటా సీడ్ కంపెనీ ఆర్గనైజర్ జంగం సతీశ్ అన్నారు. మండలంలోని చీమలపేటలో టాటా కంపెనీ ధాన్య వరి సీడ్ మేల్, ఫిమేల్‌ను యాసంగిలో సాగు చేసిన రైతులకు చెక్కులు అందజేశారు. ఫిమేల్ సీడ్‌కు ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, క్వింటాల్‌కు రూ.15వేల ధరతో కంపెనీ కొనుగోలు చేస్తుందని వివరించారు. కంపెనీ ప్రతినిధులు ఆర్‌పీఎం అనూప్, సూపర్‌వైజర్ సదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఉమామహేశ్వరస్వామి వార్షికోత్సవం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో ఉమా మహేశ్వరస్వామి వార్షికోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి హరిహర దేవాలయం ప్రాంగణంలో బ్రహ్మశ్రీ హరివర్మ, అవధాని ఆధ్వర్యంలో అర్చకులు వామనశర్మ, హరిశర్మ, అజయ్ శర్మ పూజలు నిర్వహించారు.

జాతీయ సమ్మె జయప్రదం చేయండి

రామగిరి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆర్జీ–3 కార్యదర్శి డి.కొమురయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్జీ–3 జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, కుమార్, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.


కోల్‌సిటీ: యోగా చేస్తున్న రామగుండం బల్దియా అధికారులు, ఉద్యోగులు


గోదావరిఖనిటౌన్: యోగా చేస్తున్న విద్యార్థులు


ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు


సుల్తానాబాద్: యోగా చేస్తున్న వాకర్స్

అంతర్జాతీయ యోగా డే

యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోర్టులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మైదానంలో వాకర్స్, లయన్స్ క్లబ్, పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


జూలపల్లి: జూపిటర్ విద్యాలయంలో..



ధర్మారం: ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



జ్యోతినగర్: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


ముత్తారం కేజీబీవీలో..

అపర భగీరథుడు కేసీఆర్

గోదావరిఖని: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి అపర భగీరథేడిగా కేసీఆర్ నిలిచారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు బాదె అంజలి, కల్వచర్ల కృష్ణవేణి, నీరటి శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, కుమ్మరి శ్రీనివాస్, నూతి తిరుపతి, ముద్దసాని సంధ్యారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోరుకంటి చందర్

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం

రామగుండం: మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమం.. ప్రతీ ముఖంలో ఆనందం వెల్లివిరిసిందని, ఆయన పాలన ప్రజలకు శ్రీరామరక్షగా ఉందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోల సంతోష్‌గౌడ్ అధ్యక్షత వహించగా బీఆర్‌ఎస్ కార్మిక నేత కౌశిక హరి, మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేతగా సమ్మక్క–సారలమ్మ జట్టు

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా సమ్మక్క–సారలమ్మ జట్టు నిలిచింది. శనివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్‌పై సమ్మక్క, సారలమ్మ జట్టు గెలిచింది. విజేత జట్టుకు రూ.50వేలతో పాటు కప్, రన్నర్ జట్టుకు రూ.30వేలతో పాటు కప్ అందించారు. ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, నిజామాబాద్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, బీసీ నాయకులు వకుళాభరణం కృష్ణమోహనరావు, బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి, బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష, ఆలయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న నరహరి, నాయకులు

సంక్షిప్త వార్తలు

• యోగా డాక్టరేట్‌కు సన్మానం

ఎలిగేడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాలో డాక్టరేట్ పొందిన ఎలిగేడు మండల మాజీ వైస్ ఎంపీపీ, హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామిగౌడ్‌ను శనివారం ఎలిగేడులోని ఆయన కార్యాలయంలో గ్రామస్తులు సన్మానించారు. జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మాజీ చైర్మన్ అడ్డగుంట తిరుపతిగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు మామిడాల రమేశ్, తాటిపల్లి సతీశ్‌బాబు, కెక్కర్ల చందుగౌడ్ పాల్గొన్నారు.

• ఆలయ గేటు నిర్మాణానికి విరాళం

జూలపల్లి: మండలంలోని బాలరాజుపల్లెలో పుట్టపోచమ్మ తల్లి ఆలయం వద్ద గేటు నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ రూ.20వేలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. మండల మాజీ అధ్యక్షుడు విసారపు వెంకటేశం, అలువాల తిరుపతి, కొరుకంటి స్వామి, ర్యాకం భాస్కర్, గసికంటి జనార్దన్, రేషవేని శ్రీనివాస్, కుంటూరు లక్ష్మయ్య, సంతోష్, పెరక రవి, నలిగేటి సతీశ్, కొట్టె నర్సయ్య, కొల్లూరి లచ్చయ్య ఉన్నారు.

• రామగిరి ఎస్సైగా టి.శ్రీనివాస్

రామగిరి: రామగిరి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా శనివారం శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

• పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

ఓదెల: ఓదెల హైస్కూలు పాఠశాలకు 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్పీకర్‌బాక్స్, ఆంపిల్ వైర్, మైక్‌సెట్ శనివారం అందజేశారు. ఎంఈవో ఎర్ర రమేశ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు రాజు, శంకర్, మోహన్ ఉన్నారు.

• నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖనిటౌన్: ఇంటర్ బోర్డు నియమ నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం శనివారం జిల్లా ఇంటర్ విద్యాధికారి కల్పనకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సాగర్, రాహుల్, వినయ్, అజయ్ పాల్గొన్నారు.

• కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగుండం: రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ద.మ.రైల్వే ప్రజా సంబంధాల ప్రతినిధి అనుమాస శ్రీనివాస్ కలిశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

• దరఖాస్తులు ఆహ్వానం

రామగుండం: అంతర్గాం మండల పరిధి లింగాపూర్ గ్రామ శివారులోని మోడల్ (ఆదర్శ) విద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన, గంటల పద్ధతిలో పీజీటీ ఆంగ్లం పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పంబాల సదానందం తెలిపారు. ఎంపికైన అధ్యాపకుడు 9 నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లీషు సబ్జెక్టు బోధించాల్సి ఉంటుందన్నారు. ఎం.ఏ. (ఇంగ్లీష్), బీఎడ్ చేసినవారు అర్హులన్నారు. జూన్ 24లోపు దరఖాస్తు చేసుకోవాలని, 26న డెమో తరగతి ఉంటుందన్నారు.

• రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన వంశీ సాగర్, పల్మానంద్, భక్తబేశ్రాలు గంగానగర్ వెళ్తున్నారు. బి–టైపు గేట్ సర్వీసు రోడ్డు నుంచి వచ్చిన ఇన్నోవా వాహనం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి గోదావరిఖని వైపు ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

• వ్యక్తిత్వ వికాసానికి యోగా దోహదం

మంథని: మనిషి వ్యక్తిత్వ వికాసానికి యోగా దోహదపడుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంథని ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఆయన యోగా, ధ్యానం చేశారు.

• బాధిత కుటుంబాలకు పరామర్శ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన దండె శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా ఆయన కుటుంబంతో పాటు బాపూజీ నగర్‌కు చెందిన ఆకుల రాజమ్మ, కొట్టె రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు.

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీకి చెందిన బైరాంగుల రాహుల్, కల్వచర్లకు చెందిన పల్లె ధనమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ వారి కుటుంబాలను పరామర్శించారు.

• రైస్‌మిల్ ఆపరేటర్లు సమ్మెలో పాల్గొనాలి

సుల్తానాబాద్: దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహించే సమ్మెలో రైస్‌మిల్ ఆపరేటర్లు, గుమస్తాలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పట్టణంలోని పెద్దమ్మ ఆలయం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి, నాయకులు మాతంగి రాజమల్లు, పూసాల సంపత్, బండారి తిరుపతి, స్వామి మహేందర్, రాజమౌళి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

• ప్రపంచ సంగీత దినోత్సవం

గోదావరిఖనిటౌన్: గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా సమీపంలోని స్ఫూర్తి భవన్‌లో శనివారం ప్రపంచ సంగీత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాకారులకు కళారత్న పురస్కారాలు ప్రదానం చేశారు.

ఆర్జీ–2 ఏరియాలో పర్యటన


ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 ఏరియాలో ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓసీపీ–3 ప్రాజెక్టు వద్దకు వెళ్లి వ్యూపాయింట్ ద్వారా ఓబీ, బొగ్గు వెలికితీత పనులు పరిశీలించారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, వకీల్‌పల్లి ఏజెంట్ ఎ.నెహ్రూ, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, ప్రాజెక్టు మేనేజర్ భారత్‌కుమార్ పాల్గొన్నారు.

రెస్క్యూ సూపరింటెండెంట్‌కు సన్మానం

గోదావరిఖని: సింగరేణిలో కోల్‌పిల్లర్‌గా చేరి అంచలంచెలుగా ఎదుగుతూ రెస్క్యూ విభాగానికి సూపరింటెండెంట్‌గా నియామకమైన రాజేందర్‌రెడ్డిని శనివారం సన్మానించారు. రెస్క్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మధుబాబు, తిరుపతి, ఏఎస్ మూర్తి, మధుబాబు, వెంకటేశ్, మల్లేశ్, అభిషేక్, కట్కూరి రవీందర్‌రెడ్డి, రమేశ్, సుధీర్, కిషన్‌రావు, నవాబు, సందీప్, శ్రీను, వేనన్న పాల్గొన్నారు.

రెస్క్యూ శిక్షణ పరిశీలన

గోదావరిఖని: మహిళా రెస్క్యూ సభ్యులకు 14రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణను ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య శనివారం పరిశీలించారు. మెయిన్ రెస్క్యూ స్టేషన్ సందర్శించి వారితో మాట్లాడారు. రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ తిరుపతి, ట్రైనర్స్ కిషన్‌రావు, సాజిద్‌అలీ, వేణు, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

గైర్హాజర్ కాకుండా విధులు నిర్వహించాలి

గోదావరిఖని: గైర్హాజర్ లేకుండా విధులు నిర్వహించాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య ఆదేశించారు. 16మందికి శనివారం కారుణ్య నియామకపత్రాలు అందజేశారు. అధికారులు పి.అరవింద్‌రావు, మురళీకృష్ణ, షరీఫ్ మహమ్మద్, వంశీధర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం ఆర్జీ–1 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్‌ను కలిశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆసరి మహేశ్, గౌస్, శంకర్, తాళ్లపల్లి శ్రీనివాస్, శివారెడ్డి, దశరథరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించాలి

రామగిరి: యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు ఆదేశించారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 ఎస్‌అండ్‌డీ విభాగం బీఈఎంఎల్ కంపెనీకి చెందిన రూ.4.91కోట్ల విలువ గల 6.5 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల నూతన షావెల్ యంత్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. భద్రత నియమాలు పాటించడంలో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, యు.కుమార్‌స్వామి, అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామరావు, అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోచమ్మతల్లికి బోనాలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్, తేలుకుంట గ్రామాల్లో పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. పెద్దాపూర్‌లో నగారా పోచమ్మ తల్లికి మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తేలుకుంటలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి పట్నాల ఉత్సవంలో భాగంగా పోచమ్మతల్లి బోనాలు నిర్వహించారు. పెద్దాపూర్‌లో పెద్దపల్లి కొమురయ్య, రాజేందర్, సత్యసాగర్, తేలుకుంటలో చొప్పరి నర్సింగం, శేఖర్ పాల్గొన్నారు.


పెద్దాపూర్‌లో పోచమ్మ బోనాలు

దొంగతుర్తిలో ఉచిత వైద్యశిబిరం

ధర్మారం: మండలం దొంగతుర్తిలో శనివారం మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

సింగరేణి వార్తలు

భారీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోదావరిఖని: భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకుని ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య సూచించారు. ఓసీపీ–3లో 6.5 క్యూబిక్ మీటర్ల హైడ్రాలిక్ షావల్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. రూ.4.91 కోట్లతో బీఈఎంఎల్ సంస్థ నుంచి కొనుగోలు చేసిన 6.5 క్యూబిక్ మీటర్ల హైడ్రాలిక్ షావల్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, గని మేనేజర్ భారత్‌కుమార్, కాలరీ ఇంజినీర్ జలపతి, షావల్ ఇన్‌చార్జి జనార్దన్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, సీనియర్ పర్సనల్ అధికారి సాయికృష్ణ, సంక్షేమాధికారి అజీజ్, ప్రాజెక్టు సెక్రటరీ మహేందర్, బీఈఎంఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.


షావల్‌ను ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

యోగా నిజ జీవితంలో భాగం కావాలి


గోదావరిఖని: యోగా చేస్తున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్,


యోగా చేస్తున్న ఆర్జీ–2 జీఎం వెంకటయ్య


రామగిరి: యోగా చేస్తున్న జీఎం నాగేశ్వరరావు


రామగిరి: యోగా చేస్తున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని: యోగా నిజజీవితంలో భాగంగా కావాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. స్థానిక జీఎం కాలనీ గ్రౌండ్‌లో శనివారం సామూహిక యోగా నిర్వహించారు. రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.మధుసూదన్, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదావరిఖని: యోగా వేడుకల్లో ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య, సింగరేణి అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరి: జీఎం కార్యాలయంలో నిర్వహించిన యోగాభ్యాస కార్యక్రమంలో ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు యోగా చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, బెల్లం శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

రామగిరి: ఏపీఏ గని ఆవరణలో శనివారం ఉద్యోగులు, అధికారులతో కలిసి ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు యోగాసనాలు వేశారు. ప్రాజెక్టు అధికారి కె.జనార్దన్, మేనేజర్ సునీల్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ రవిచంద్ర, పిట్ సెక్రటరీలు గంగాధర్, మండల కొమురయ్య పాల్గొన్నారు.

సింగరేణిలో సర్వే అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలో ముగ్గురు సర్వే అధికారులను శనివారం బదిలీచేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు సీఆర్/పీఈఆర్/సీ/26/2071 ఉత్తర్వులిచ్చారు. సేఫ్టీ కార్పొరేట్‌లో సూపరింటెండెంట్ సర్వే అధికారిగా పనిచేసిన డి.వెంకటేశ్వర్లును కొత్తగూడెం సర్వే డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. ఏపీఏ ఏరియా ఏఎల్‌పీ సూపరింటెండెంట్ అధికారి ఎం.నారాయణ జీడీకే–11 బదిలీ అయ్యారు. జీడీకే–11గనిలో పనిచేసిన వై.హన్మండ్లును ఏఎల్‌పీ ఏరియాకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆరుగురు ఫారెస్ట్ అధికారులు బదిలీ

ఆరుగురు ఫారెస్ట్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మందమర్రి ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డిని కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాకు బదిలీ చేశారు. కొత్తగూడెం, ఇల్లెందు ఫారెస్ట్ డీజీఎం ఏబీహరినారాయణను శ్రీరాంపూర్‌కు బదిలీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న జూనియర్ ఫారెస్ట్ అధికారి కె.మేఘనను ఆర్జీ–3 ఏరియాకు బదిలీ చేశారు. ఆర్జీ–3 ఏరియా సీనియర్ ఫారెస్ట్ అధికారి కళ్యాణ్ మణుగూరుకు బదిలీ అయ్యారు. ఆర్జీ–2 ఏరియా ఫారెస్ట్ అధికారి ఆర్.నవీన్‌కుమార్‌ను మందమర్రి ఏరియాకు బదిలీ చేశారు. కార్పొరేట్‌లో పనిచేస్తున్న జూనియర్ ఫారెస్ట్ అధికారి సుష్మలక్ష్మిని బెల్లంపల్లికి బదిలీ చేశారు.

అంతర్గాం మండల పరిషత్‌లో ఉపాధి సామాజిక తనిఖీ

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 4వ విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31, 2025 మధ్య కాలంలో గ్రామాల వారీగా నిర్వహించిన ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ బృందాలు పరిశీలించాయి. నిధుల వినియోగానికి చేపట్టిన పనులను పరిశీలించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో 322 పనులు చేపట్టారు. రూ.3.65కోట్లు ఉపాధికి ఖర్చు చేశారు. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ నిధులతో 20 చోట్ల సీసీ రహదారులు నిర్మించగా వేతనాల రూపంలో రూ.2,403 చెల్లించగా మెటీరియల్‌కు రూ.2.39 కోట్లు వినియోగించి మొత్తం రూ.2.40 కోట్లు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించారు. కాగా సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టగా పలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ నిధులకు బాధ్యులైన కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రికవరీ చేయనున్నారు. గ్రామాల వారీగా బ్రాహ్మణపల్లిలో రూ.5,615, ఎగ్లాస్‌పూర్ రూ.1,160, గోలివాడ రూ.165, మద్దిర్యాల రూ.11,181, వినంపేట రూ.1,322, ఆకెనపల్లి రూ.625, సోమనపల్లి రూ.687, పెద్దంపేట రూ.3,905, మొత్తంగా రూ.24,660 నగదులో అవకతవకలను గుర్తించి వారి నుంచి రికవరీకి ఆదేశించారు. డీఆర్‌డీవో, ప్రిసైడింగ్ అధికారి కాళిందిని, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కొమురయ్య, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ మల్లికార్జున్, అంబుడ్స్‌మెన్ శరత్‌కుమార్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ హరికృష్ణ, ఎంపీడీవో బైరి వేణుమాధవ్, ఏపీవో రమేశ్, ఈసీ అయూబ్‌ఖాన్, ఎస్సార్పీ మౌనిక ఉన్నారు.


సోషల్ ఆడిట్‌కు హాజరైన అధికారుల బృందం

రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక జయశంకర్ సార్

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర సాధనలో తొలి, దశ మలిదశ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని టీబీజీకేఎస్ యూనియన్ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జయశంకర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, అనిల్‌రెడ్డి, రవితేజ, వెంకటేశ్, కమలాకర్, అశోక్, రామ్‌చరణ్ పాల్గొన్నారు. కాలనీలోని విశ్వకర్మ శివాలయం కమిటీ ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి నిర్వహించారు.


నివాళి అర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

కాల్వశ్రీరాంపూర్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని మాజీ జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.